సాక్షి
కాకినాడ
బుధవారం । 12 । మార్చి । 2025



150 కేజీల గంజాయి పట్టివేత

లక్షల రూపాయల గంజాయిని తరలిస్తున్న ముఠా గుట్టు రట్టు చేశారు పోలీసులు. వారి నుంచి పెద్ద మొత్తంలో గంజాయి స్వాధీనం చేసుకున్నారు.

8లో



సాగుకు నీటి విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి మంగళవారం తూర్పు డెల్టాకు 2,950, మధ్య డెల్టాకు 1,900, పశ్చిమ డెల్టాకు 5 వేల క్యూసెక్కుల చొప్పున గోదావరి నీటిని వదిలారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ బుధవారం (సాయంత్రం)	సహర్ గురువారం (ఉదయం)
రాజమండ్రి	6.20	4.52
కాకినాడ	6.21	4.52
అమలాపురం	6.20	4.53

సర్కారు వారి దగా

- ఉద్యోగాల భర్తీ లేదు.. నిరుద్యోగ భృతి లేదు
- 11,990 మంది వలంటీర్లను రోడ్డున పడేశారు
- ఫైగా లక్షల ఉద్యోగాలిచ్చినట్లు బిల్డప్‌లు
- అరకొరగా ఫీజు రీయింబర్స్‌మెంట్
- కూటమి ప్రభుత్వ కుయుక్తులపై వైఎస్సార్ సీపీ ఉద్యమ బాట
- నేడు కాకినాడలో 'యువత పోరు'



సాక్షి ప్రతినిధి, కాకినాడ: జాబు కావాలంటే బాబు రావాలి.. జనవరి 1నే జాబ్ క్యాలెండర్.. పరిశ్రమల ఏర్పాటు.. వర్క్ ఫ్రం హోం కోసం హైటెక్ టవర్లు.. 20 లక్షల ఉద్యోగాలు.. ఉద్యోగాలు రాకుంటే నిరుద్యోగులకు ప్రతి నెలా రూ.3 వేల నిరుద్యోగ భృతి.. అంటూ సార్వత్రిక ఎన్నికల్లో కూటమి పెద్దలు చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు ఊరూవాడా ఊదరగొట్టేశారు. తీరా అధికారం పగ్గాలు చేపట్టిన తర్వాత ఇచ్చిన హామీలను గాల్లో కలిపేసి, నమ్మిన జనాన్ని నిట్టనిలువునా నట్టేట ముంచేశారు. తాజాగా అసెంబ్లీలో ప్రవేశపెట్టిన పూర్తి స్థాయి బడ్జెట్‌లో సైతం అరకొర నిధులతో మరోసారి దగా చేశారు. తల్లికి వందనం అని చెప్పి తల్లికి వంచన చేస్తున్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ఊసే లేదు. తొమ్మిది నెలల పాలనలో కొత్త ఉద్యోగాలివ్వకపోగా.. ఉన్నవి ఊడబీకారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న దగాపై యువత, విద్యార్థులు కన్నెర్ర చేస్తున్నారు. వారికి మద్దతుగా ఉద్యమించేందుకు వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ మేరకు చంద్రబాబు, పవన్ కల్యాణ్ మాటలు నమ్మి మోసపోయిన యువత పక్షాన పార్టీ నేతలు, కార్యకర్తలు బుధవారం కాకినాడలో యువత పోరు పేరిట పోరాటానికి సిద్ధమయ్యారు. విద్యార్థులకు, నిరుద్యోగులకు ఇచ్చిన ఎన్నికల హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్‌కు భారీ ర్యాలీగా తరలి వెళ్లి, కలెక్టర్‌కు వినతిపత్రం అందజేయనున్నారు. ఈ దిశగా పార్టీ శ్రేణులతో పాటు, విద్యార్థులు, నిరుద్యోగులు కూడా ముందుకు కదులుతున్నారు.

యువత పోరుకు సర్వం సిద్ధం



కాకినాడ బాలాత్రిపుర సుందరి ఆలయం వెనుక ఉన్న వైఎస్సార్ సీపీ సిటీ కార్యాలయంలో పార్టీ జిల్లా స్థాయి ఆవిర్భావ దినోత్సవం అనంతరం యువత పోరు కార్యక్రమం ప్రారంభమవుతుంది. అక్కడి నుంచి జిల్లా నలుమూలల నుంచీ తరలివచ్చే విద్యార్థులు, యువతకు మద్దతుగా పార్టీ నేతలు, శ్రేణులు ముందు నిలిచి జిల్లా పరిషత్ సెంటర్ మీదుగా కలెక్టరేట్ వరకూ ర్యాలీ నిర్వహిస్తాం. విద్యార్థులు, యువతకు కూటమి సర్కార్ ఇచ్చిన హామీలు అమలు చేయాలనే డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్‌కు అందజేస్తాం.

– దాడిశెట్టి రాజా, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి

తల్లికి వంచన

తల్లికి వందనం పేరిట కుటుంబంలో చదువుకునే పిల్లలందరికీ ఏడాదికి రూ.15 వేల చొప్పున ఇస్తామని చంద్రబాబు అండ్ కో నమ్మించారు. తీరా గద్దెనెక్కాక 'తల్లికి మాత్రమే రూ.15 వేలు' అని మెలిక పెడుతూ జీఓ ఇచ్చారు. దీనిపై పెద్ద ప్రజలు అగ్గి మీద గుగ్గిలమవ్వడంతో తూచ్ అంటూ మాట మార్చారు. కానీ, నెలలు గడుస్తున్నా ఇంతవరకూ విద్యార్థుల తల్లుల ఖాతాల్లో చిల్లిగవ్వ కూడా జమ చేయలేదు. జిల్లాలో ఈ పథకానికి అర్హులైన విద్యార్థులు 1,86,708 మంది ఉన్నారు. వీరికి తల్లికి వందనం కింద రూ.250.30 కోట్లు చెల్లించాలి. కానీ, పైసా కూడా చంద్రబాబు విదల్చలేదని తల్లిదండ్రులు మండిపడుతున్నారు. అదే, గత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో అమ్మ ఒడి పథకం ద్వారా ప్రతి కుటుంబానికి రూ.13 వేల చొప్పున విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నేరుగా జమ చేశారు. మిగిలిన రూ.2 వేలలో రూ.వెయ్యి డిస్ట్రిక్ట్ టాయిలెట్స్ మెయింటెనెన్స్‌కు, మరో రూ.వెయ్యి డిస్ట్రిక్ట్ స్కూల్ మెయింటెనెన్స్ ఫండ్‌కు జమ చేశారు.

రూ.166 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు

జిల్లావ్యాప్తంగా పాలిటెక్నిక్, ఐటీఐ, డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాలలు 170 వరకూ ఉన్నాయి. వీటన్నింటిలో 50 మందికి పైగా విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరికి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం క్రమం తప్పకుండా జగనన్న విద్యా దీవెన పథకం ద్వారా ఫీజు రీయింబర్స్‌మెంట్ అందించేది. దీనికితోడు వసతి దీవెన నిధులు కూడా ఇచ్చేది. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడటంతో చివరిలో ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు నిబంధనలు అడ్డం పడ్డాయి. ఎన్నికల అనంతరం కూటమి ప్రభుత్వం వచ్చాక జిల్లాలో 2023–24 విద్యా సంవత్సరానికి మూడు విడతలు, 2024–25లో రెండు విడతలుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వాల్సి ఉండగా.. ఒక విడత మాత్రమే ఇటీవల విడుదల చేశారు. మొత్తం మూడు విడతలకు సంబంధించి రూ.90 కోట్ల మేర కూటమి సర్కార్ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయి పెట్టేసింది. విద్యార్థులకు మెయింటెనెన్స్ ఫీజు కింద మొక్కుబడిగా రూ.2 కోట్లు విడుదల చేసి, రూ.76 కోట్లు బకాయిలు పెట్టేసింది. మొత్తం అన్నీ కలిపి రూ.166 కోట్ల మేర విద్యార్థులకు బకాయి పెట్టింది. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకపోవడంతో కళాశాలలకు ఫీజులు చెల్లించలేక తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు కళాశాలల యాజమాన్యాలు కూడా విద్యార్థులకు హాల్ టికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నాయి.

ఉద్యోగాలు హుళక్కి

- అధికారంలోకి వస్తే 20 లక్షల ఉద్యోగాలిస్తామని కూటమి పెద్దలు చెప్పడంతో డిగ్రీ, ఇంజినీరింగ్ పూర్తి చేసిన వేలాది మంది డీఎస్సీ, గ్రూప్, పోలీస్ రిక్రూట్‌మెంట్, ఏపీపీఎస్సీ తదితర కొలువుల కోసం వేలాది మంది ప్రయత్నాలు చేస్తున్నారు. వారి భవిష్యత్తు కోసం అయినకాడికి అప్పులు చేసి కోచింగ్ సెంటర్లలో శిక్షణ ఇప్పిస్తున్న తల్లిదండ్రులు కూడా ఎంతో మంది ఉన్నారు. ఉన్నత చదువులు చదివి కుటుంబ ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా అరకొర జీతంపై స్థానికంగా, హైదరాబాద్, బెంగళూరు, చెన్నై తదితర ప్రాంతాలకు వలస వెళ్లి ప్రైవేటు సంస్థల్లో పని చేస్తున్న వారి సంఖ్య లక్షన్నర పైనే ఉంది. వీరిలో కూడా మూడు వంతుల మంది తమ చదువుకు తగిన ఉద్యోగం కోసం కళ్లు కాయలు కాచేలా ఎదురు చూస్తున్నారు. కానీ, ప్రభుత్వం మాత్రం ఉద్యోగాల భర్తీ హామీని తుంగలో తొక్కేసింది.
- కొత్త ఉద్యోగాల మాట దేవుడెరుగు.. ఉన్నవి ఊడబీకేస్తున్నారు. తాము అధికారంలోకి వస్తే వలంటీర్లను కొనసాగించి రూ.5 వేల జీతాన్ని రూ.10 వేలకు పెంచుతామన్నారు. తీరా చూస్తే మొత్తం వ్యవస్థనే లేకుండా చేసేశారు. ఫలితంగా జిల్లాలోని 11,990 మంది వలంటీర్లు రోడ్డున పడ్డారు.
- కూటమి నేతలకు మద్యం షాపులు కట్టబెట్టేందుకు ప్రైవేటు మద్యం పాలసీని కూటమి ప్రభుత్వం తీసుకుని వచ్చింది. దీని ఫలితంగా గత వైఎస్సార్ సీపీ హయాంలో ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పని చేసిన సుమారు 1,000 మంది ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ఉద్యోగాలు కోల్పోయారు.
- ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగాలివ్వకపోగా అవుట్ సోర్సింగ్ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లను దగా చేశారు.
- ఉద్యోగాలు ఇవ్వలేకుంటే అప్పటి వరకూ 18 నుంచి 35 సంవత్సరాలలోపు వయస్సు ఉన్న వారికి ప్రతి నెలా నిరుద్యోగ భృతి ఇస్తామని చంద్రబాబు చెప్పారు. జిల్లాలో ఈ వయస్సులో ఉన్న యువత 3.15 లక్షల పైనే. వీరికి ప్రతి నెలా రూ.3 వేల చొప్పున రూ.94,50,00,000, తొమ్మిది నెలలకు రూ.850,50,00,000 చెల్లించాల్సి ఉంది. కానీ, 2014లో రూ.2 వేల నిరుద్యోగ భృతి ఇస్తామని నమ్మించి, వంచించినట్టుగానే ఇప్పుడు కూడా చంద్రబాబు రూ.3 వేల భృతి హామీని గాల్లో కలిపేశారని నిరుద్యోగులు మండిపడుతున్నారు.

న్యూస్‌రీల్

నేడు వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం



సాక్షి ప్రతినిధి, కాకినాడ: వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించేందుకు పార్టీ శ్రేణులు సమాయత్తమయ్యాయి. జిల్లాలో ఎక్కడికక్కడ పార్టీ జెండాలను నేతలు ఆవిష్కరించనున్నారు. ఈ సందర్భంగా సభలు, సమావేశాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. వైఎస్సార్ సీపీ అధిష్టానం ఆదేశాల మేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి దాడిశెట్టి రాజా ప్రతి గ్రామంలోను ప్రజాప్రతినిధులు, నేతలు, శ్రేణులు సమష్టిగా పార్టీ ఆవిర్భావ దినోత్సవాలు ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఆయా నియోజకవర్గాల్లో పార్టీ ముఖ్య నాయకులు దగ్గరుండి పార్టీ జెండాను ఆవిష్కరించడంతో పాటు సేవా కార్యక్రమాలు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. కాకినాడలోని వైఎస్సార్ సీపీ సిటీ కార్యాలయంలో జిల్లా స్థాయిలో పార్టీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహిస్తున్నామని చెప్పారు.

ఎన్నికల ప్రక్రియ బలోపేతానికి సలహాలివ్వాలి



కలెక్టర్ షణ్మోహన్

కాకినాడ సిటీ: ఎన్నికల ప్రక్రియను మరింత బలోపేతం చేయడానికి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు అవసరమైన సలహాలు, సూచనలు ఈ నెల 31వ తేదీ నాటికి అందజేయాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో నూతన సంస్కరణలు తీసుకొచ్చే లక్ష్యంతో భారత ఎన్నికల సంఘం అన్ని జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీల నుంచి సూచనలు సలహాలు ఆహ్వానించిందన్నారు. ప్రజాప్రాతినిధ్య చట్టం 1950, 1951, ఓటర్ల నమోదు నియమాలు, ఎన్నికల ప్రవర్తనా నియమావళి వంటి అంశాలపై సూచనలు అందజేయవచ్చన్నారు. వచ్చిన సూచనలు, సలహాలపై భారతీయ ఎన్నికల సంఘం ఏప్రిల్ 30న అన్ని జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీల ప్రతినిధులతో చర్చిస్తుందని కలెక్టర్ తెలిపారు.

టెన్త్ విద్యార్థులకు ఉచిత బస్సు ప్రయాణం



బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు ఈ నెల 17 నుంచి 31వ తేదీ వరకూ ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నారు. జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. విద్యార్థులు వారి హాల్ టికెట్టు చూపించి, పరీక్ష తేదీల్లో ఉచిత ప్రయాణాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జనసేన నాయకుడి దాడిపై నివేదిక ఇవ్వండి

రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆదేశం

కరప: స్థానిక మహాత్మా జ్యోతిబా పూలే బీసీ సంక్షేమ గురుకుల విద్యాలయం విద్యార్థులపై జనసేన పార్టీ నాయకుడు భోగిరెడ్డి గంగాధర్ దాడి చేసిన ఘటనపై రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ స్పందించింది. ఈ నెల 4న గురుకుల విద్యాలయం విద్యార్థులపై గంగాధర్ పిడిగుద్దులతో దాడి చేయడం, బూటు కాలితో తన్నడంపై రెండు రోజులుగా పత్రికల్లో వస్తున్న వార్తలపై కమిషన్ చైర్మన్ కె.అప్పారావు, సభ్యురాలు టి.ఆదిలక్ష్మి స్పందించారు. దీనిపై సమగ్ర దర్యాప్తు చేసి, నివేదిక ఇవ్వాలని జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి (డీసీపీఓ) వెంకట్, ఐసీడీఎస్ సీడీపీఓ వై.లక్ష్మి, పీఓ ఎన్ఐసీ శ్రీనివాస్‌లను ఆదేశించారు. ఈ మేరకు ఆ అధికారులు మంగళవారం గురుకుల విద్యాలయానికి చేరుకుని, టెన్త్ విద్యార్థులను, సిబ్బందిని విచారించారు. ప్రిన్సిపాల్ కృష్ణారావు సమక్షంలో గంగాధర్, పోలీసు కానిస్టేబుల్‌తో కలసి వచ్చి తమపై దాడి చేసి, బూటు కాలితో తన్నాడని విద్యార్థులు చెప్పారు. విద్యార్థులను కొట్టడం చూశామని కొంత మంది సిబ్బంది చెప్పగా, చూడలేదని మరి కొంత మంది చెప్పారు. విచారణ అనంతరం సంబంధిత నివేదికను ఆయా అధికారులు కలెక్టర్, జిల్లా విద్యాశాఖాధికారులకు అందజేశారని తెలిసింది.

అన్ని వర్గాలకూ చంద్రబాబు సర్కార్ మోసం

- నేడు యువత పోరు
- పోస్టర్ ఆవిష్కరించిన వైఎస్సార్ సీపీ నేత కురసాల కన్నబాబు

కాకినాడ రూరల్: హామీలు నెరవేర్చకుండా మహిళలు, రైతులు, విద్యార్థులు, యువత, నిరుద్యోగులు.. ఇలా రాష్ట్రంలోని అన్ని వర్గాలనూ మోసగిస్తున్న చంద్రబాబు ప్రభుత్వాన్ని నిలదీయడానికి వైఎస్సార్ సీపీ నిరంతరం సిద్ధంగా ఉంటుందని వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర జిల్లాల రీజినల్ కో ఆర్డినేటర్, మాజీ మంత్రి కురసాల కన్నబాబు అన్నారు. తమ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు అన్ని జిల్లాల కలెక్టరేట్ల వద్ద బుధవారం యువత పోరు కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. కాకినాడ రమణయ్యపేట వైద్య నగర్‌లోని కార్యాలయంలో యువత పోరు పోస్టర్‌ను ఆయన మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ, ఫీజు రీయింబర్స్‌మెంట్ అంటే దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి గుర్తుకొస్తారని, ఆయన తరువాత మొత్తం ఫీజు చెల్లించే ప్రక్రియకు గత సీఎం వైఎస్ జగన్ శ్రీకారం చుట్టారని అన్నారు. ఈ రోజు సుమారు రూ.4,600 కోట్ల మేర బకాయి పెట్టి విద్యార్థుల భవిష్యత్తుతో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆటలాడుతున్నారని దుయ్యబట్టారు. కళాశాలల అకౌంట్లలో డబ్బులు వేస్తామని ప్రభుత్వం చెబుతూండగా.. తమకు డబ్బులు రాలేదంటూ విద్యార్థులను యాజమాన్యాలు బెదిరిస్తున్నాయని చెప్పారు. దీంతో, హాల్ టికెట్లు ఇస్తారో, లేదోనని, పరీక్ష హాలులో కూర్చోనిస్తారో, లేదోనని విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారన్నారు. చంద్రబాబు మెగా డీఎస్సీ ఫైలుపై తొలి సంతకం చేశారని, ప్రతి నెలా రూ.3 వేల నిరుద్యోగ భృతి ఇస్తామన్నారని, ఈ హామీలకు ఇప్పటికీ అతీగతీ లేదని కన్నబాబు విమర్శించారు. అధికారమే చంద్రబాబు పరమావధి అని అన్నారు. గత సీఎం వైఎస్ జగన్ హయాంలో 17 వైద్య కళాశాలల నిర్మాణం ప్రారంభించగా 5 కాలేజీల్లో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయన్నారు. పూర్తయిన పులివెందుల సహా అన్ని కళాశాలలనూ ప్రైవేటు పరం చేయడానికి చంద్రబాబు కంకణం కట్టుకున్నారన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ విద్య, వైద్యం పట్ల ఇంత చులకన దేనికని, పూర్తిగా వ్యాపారంగా మార్చాలని ఎందుకనుకుంటున్నారని ప్రశ్నించారు. పీపీపీ పేరిట రూ.వేల కోట్లతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన వైద్య కళాశాలలను అస్తవ్యస్తం చేస్తున్నారన్నారు. తమకు మెడికల్ సీట్లు వద్దని కేంద్రానికి లేఖ రాసిన తొలి ముఖ్యమంత్రిగా చంద్రబాబుకు ఖ్యాతి దక్కిందని ఎద్దేవా చేశారు. పేదలకు మంచి జరుగుతుందంటే అడ్డుకుంటున్నారన్నారు. అందుకే యువత పోరు పేరిట పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించి, కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, యువత, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కన్నబాబు కోరారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు కురసాల సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యుడు నురుకుర్తి రామకృష్ణ, సర్పంచ్‌లు బెజవాడ సత్యనారాయణ, రామదేవు సూర్యప్రకాశరావు, పార్టీ విద్యార్థి, బీసీ విభాగాల జిల్లా అధ్యక్షులు పూసల అనిల్, అల్లి రాజబాబు తదితరులు పాల్గొన్నారు.



యువత పోరు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కురసాల కన్నబాబు తదితరులు


ర్యాంకు పెరిగినా.. పెరగని సంతృప్తి

- అన్నవరం దేవస్థానానికి ఫిబ్రవరిలో రెండో ర్యాంకు
- దర్శనం, మౌలిక వసతులు, ప్రసాదంపై ఇంకా భక్తుల్లో అసంతృప్తి

అన్నవరం: గత నెలలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన అభిప్రాయ సేకరణలో అన్నవరం దేవస్థానానికి సంబంధించి విచిత్రమైన పరిస్థితి నెలకొంది. రాష్ట్రంలోని ఏడు ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో జనవరిలో నిర్వహించిన అభిప్రాయ సేకరణ ప్రకారం అన్నవరం దేవస్థానానికి చిట్టచివరిగా ఏడో ర్యాంకు రాగా, గత నెలలో చేపట్టిన అభిప్రాయ సేకరణ ప్రకారం పరిస్థితి మెరుగుపడి, రెండో ర్యాంకు వచ్చింది. అయితే, జనవరితో పోలిస్తే ఫిబ్రవరిలో ఇక్కడ అందిస్తున్న సేవలపై భక్తుల్లో అసంతృప్తి పెరిగిందని గణాంకాలు చెబుతున్నాయి. మిగిలిన దేవస్థానాల కన్నా ఇక్కడ తక్కువ అసంతృప్తి ఉండటం ద్వారా అన్నవరం రెండో స్థానంలో నిలిచిందని తెలుస్తోంది.

అభిప్రాయ సేకరణ జరిపారిలా..

- కాణిపాకం, శ్రీకాళహస్తి, ద్వారకా తిరుమల, విజయవాడ కనకదుర్గ గుడి, విశాఖ జిల్లా సింహాచలం, శ్రీశైలం, అన్నవరం దేవస్థానాల్లో భక్తులకు సేవలు, ప్రసాదం నాణ్యత, ఇతర ఏర్పాట్లపై జనవరి 25 – ఫిబ్రవరి 24 తేదీల మధ్య వాట్సాప్, ఐవీఆర్ఎస్ ద్వారా అభిప్రాయాలు తెలుసుకుని తాజా ర్యాంకులు ప్రకటించారు.
- సత్యదేవుని సన్నిధిలో 'దర్శనం మీరు భావించిన సమయంలో జరిగిందా?' అనే ప్రశ్నకు 70 శాతం మంది అవునని బదులిచ్చారు. 30 శాతం మంది అలా జరగలేదని చెప్పారు. జనవరిలో సంతృప్తి వ్యక్తం చేసిన భక్తులు 78 శాతం మంది ఉండగా ఫిబ్రవరిలో 8 శాతం మంది ఎక్కువగా అసంతృప్తి వ్యక్తం చేశారు.
- దేవస్థానంలో మౌలిక వసతుల కల్పన, తాగు నీరు, వాష్ రూములు, వెయిటింగ్ ఏరియా, రవాణా సౌకర్యాలు, చెప్పులు భద్రపరిచే చోటు తదితర అంశాలపై 65 శాతం భక్తులు సంతృప్తి, 35 శాతం మంది అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ విషయాల్లో అన్నవరం దేవస్థానానికి మూడో ర్యాంకు వచ్చింది. జనవరిలో 67 శాతం మంది సంతృప్తి వ్యక్తం చేయడం గమనార్హం. దీంతో పోలిస్తే ఫిబ్రవరిలో ఇది 2 శాతం తగ్గింది.
- సత్యదేవుని ప్రసాదం రుచి, నాణ్యతలో 82.4 శాతం మంది సంతృప్తి వ్యక్తం చేయడం ద్వారా రెండో ర్యాంకు వచ్చింది. జనవరిలో 87 శాతం మంది సంతృప్తి వ్యక్తం చేశారు.
- మొత్తం మీద దేవస్థానం అందిస్తున్న సేవల్లో ఫిబ్రవరిలో నిర్వహించిన సర్వే ప్రకారం భక్తుల్లో అసంతృప్తి శాతం పెరిగినట్లు తెలుస్తోంది. కనీసం ఈ నెలలోనైనా భక్తుల సంతృప్తి శాతం పెరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



అన్నవరం దేవస్థానం

బ్యాంకు రుణాల పంపిణీ ముమ్మరం చేయాలి

కాకినాడ సిటీ: జిల్లాలోని వివిధ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉపాధి, సంక్షేమ పథకాల లబ్ధిదారులకు బ్యాంకు రుణాల పంపిణీ మరింత ముమ్మరం చేయాలని జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా కోరారు. కలెక్టరేట్‌లో మంగళవారం జరిగిన బ్యాంకర్లు, జిల్లా అధికారులతో కూడిన జిల్లా కన్సల్టేటివ్ కమిటీ, జిల్లా స్థాయి రివ్యూ కమిటీ సమావేశాలకు ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గత ఏడాది డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసానికి సంబంధించి వ్యవసాయ రంగానికి రూ.11,460 కోట్ల రుణాలు ఇవ్వాలన్నది లక్ష్యం కాగా, రూ.4,102 కోట్లు పంపిణీ చేశారన్నారు. ప్రాధాన్యేతర రంగాలకు రూ.4,184 కోట్ల రుణాలు ఇవ్వాల్సి ఉండగా, లక్ష్యానికి మించి రూ.5,872 కోట్లు పంపిణీ చేశారని చెప్పారు. జిల్లాలో ఈ ఏడాది ఇప్పటి వరకూ 15,599 మంది కౌలు రైతులకు వ్యక్తిగతంగా రూ.55.48 కోట్లు, 20,495 మంది కౌలు రైతులకు ఆర్ఎంజీ, జేఎల్జీ గ్రూపుల ద్వారా మరో రూ.79.48 కోట్ల మేర పంట రుణాలు మంజూరు చేశారన్నారు. వివిధ సంక్షేమ కార్పొరేషన్ల ద్వారా 3,704 మందికి రూ.4,568 కోట్ల రుణాలు అందించాలనేది లక్ష్యంగా నిర్దేశించారన్నారు. దీనిని సమన్వయంతో పూర్తి చేయాలని జేసీ కోరారు. ఆయా సంక్షేమ కార్పొరేషన్ల ద్వారా 57 జనరిక్ మెడికల్ షాపుల ఏర్పాటుకు 50 శాతం బ్యాంకు రుణాలుగా రూ.228 కోట్లు అందించాలన్నారు. డీఆర్‌డీఏ ద్వారా ఇప్పటి వరకూ 14,315 డ్వాక్రా గ్రూపులకు రూ.1,075 కోట్లు, మెప్మా ద్వారా 4,312 డ్వాక్రా గ్రూపులకు రూ.508 కోట్ల మేర బ్యాంకు రుణాల లింకేజీ అందించారని తెలిపారు. పీఎం విశ్వకర్మ యోజన ద్వారా 3,801 మందికి నైపుణ్య శిక్షణ ఇస్తున్నామన్నారు. పీఎంఈజీపీ పథకం ద్వారా రూ.538 కోట్ల బ్యాంకు రుణంతో ఇప్పటి వరకూ 140 యూనిట్లు ఏర్పాటయ్యాయన్నారు. పీఎంఎఫ్ఎంఈ పథకం ద్వారా మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల స్థాపనకు ష్యూరిటీ లేకుండా రూ.10 లక్షల వరకూ రుణాలు అందించాలని బ్యాంకర్లను జేసీ రాహుల్ మీనా కోరారు. కోరారు. సమావేశంలో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కమిటీ కన్వీనర్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ హెడ్ కాకి సాయి మనోహర్, ఎల్‌డీఎం సీహెచ్ఎస్‌వీ ప్రసాద్, రిజర్వు బ్యాంకు ఎల్‌డీఓ పూర్ణిమ, నాబార్డు ఏజీఎం వై.సోమునాయుడు, డీఆర్ఓ జె.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ రాహుల్ మీనా

లక్ష్యానికి మించి 'ఉపాధి'

కరప: జిల్లాలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం లక్ష్యాన్ని గడువుకు ముందే అధిగమించామని డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి తెలిపారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయాన్ని మంగళవారం ఆమె సందర్శించారు. ఉపాధి హామీ పథకం రికార్డులను తనిఖీ చేసి, కార్యాలయ ఆధునీకరణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడుతూ, ఉపాధి హామీ పథకం ద్వారా ఈ నెలాఖరుకు 69 లక్షల పనిదినాలు కల్పించాల్సి ఉండగా ఫిబ్రవరి నెలాఖరుకే లక్ష్యాన్ని పూర్తి చేశామని చెప్పారు. రెండు లక్షల పని దినాలు పొడిగించగా ఈ నెల మొదటి వారంలోనే పూర్తి చేశామన్నారు. మరో 10 లక్షల పని దినాలు మంజూరయ్యాయని, వీటిని ఈ నెలాఖరు పూర్తి చేస్తామని చెప్పారు. రోజుకు 50 వేల మందితో పని చేయించాల్సి ఉండగా, 30 వేల మందే పని చేస్తున్నారని, రోజువారీ పనుల్లో వేతనదారుల సంఖ్యను పెంచేందుకు అన్ని చర్యలూ తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లాలోని మెట్ట ప్రాంతాల్లో 2,115 నీటి గుంతలు తవ్వించాలన్నది లక్ష్యం కాగా ఇంతవరకూ 600 గుంతల పనులు జరుగుతున్నాయని తెలిపారు. వీటిని జూన్ నెలాఖరుకు పూర్తి చేస్తామన్నారు. జిల్లాకు 750 మినీ గోకులాలు మంజూరవగా ఇంతవరకూ 700 పూర్తి చేశామన్నారు. జిల్లాలో ఈ ఏడాది 4,330 సోక్‌పిట్స్ తవ్వించేందుకు ప్రతిపాదించామని వెంకటలక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎం.అనుపమ, ఏపీఓ జీవీ రమణకుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ వీవీ వర్ధన్ తదితరులు పాల్గొన్నారు.



విలేకర్లతో మాట్లాడుతున్న డ్వామా పీడీ వెంకటలక్ష్మి. చిత్రంలో ఎంపీడీఓ అనుపమ

క్లుప్తంగా

మహారాష్ట్ర రోడ్డు ప్రమాదంలో మండపేట యువకుడి మృతి


మృతుడు జితేంద్ర (ఫైల్)

మండపేట: పొట్టకూటికి మహారాష్ట్ర పనికి వెళ్లిన మండపేట యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. నాలుగు రోజుల క్రితం జరిగిన ఈ విషాద ఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. మృతుని బంధువులు, స్నేహితులు తెలిపిన వివరాలిలా వున్నాయి. పట్టణంలోని కొండపల్లివారి వీధికి చెందిన పరమటి జితేంద్ర (33) మహారాష్ట్రలోని ఉద్గార్‌లోని ఓ ఫైనాన్స్ సంస్థలో కొంత కాలంగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో మార్చి 7వ తేదీ ఉదయం ద్విచక్ర వాహనంపై లైన్‌కు బయలుదేరాడు. హాల్నీ రహదారిపై వెళ్తున్న జితేంద్ర గండోపత్ దప్కా ప్రాంతానికి వచ్చేసరికి ప్రమాదానికి గురయ్యాడు. ఎదురుగా వేగంగా వస్తున్న నాలుగు చక్రాల గూడ్స్‌వ్యాన్ ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీ కొట్టింది. ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్న క్షతగాత్రుణ్ణి స్థానికులు ఆసుపత్రికి చేర్పించారు. అక్కడ వైద్యం పొందుతుండగా పరిస్థితి విషమించి మృతి చెందాడని చెప్పారు. ఘటనపై మహారాష్ట్ర పోలీసులు కేసు నమోదు చేశారు. పంచనామా పూర్తయ్యాక అక్కడి పోలీసులు మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించగా మహారాష్ట్ర నుంచి అంబులెన్స్‌లో సోమవారం రాత్రి మండపేట తీసుకువచ్చారు. కాగా మృతునికి భార్య, మూడు నెలల పసి పాప వున్నారు. కుటుంబం కోసం కష్టపడటానికి వెళ్లి ఎప్పుడూ క్షేమంగా ఇంటికి చేరుకునే తన భర్త ఈసారి ఎవరికీ అందనంత దూరం వెళ్లిపోయారని గుండెలవిసేలా రోదించిన భార్యను చూసి చుట్టుపక్కల వారు కంట తడి పెట్టారు.

ఉపాధి హామీ పని చేస్తూ మహిళా కూలి మృతి


ఉపాధి హామీ కూలి చంద్రమ్మ (ఫైల్)

దేవరపల్లి: ఉపాధి పని చేస్తూ అస్వస్థతకు గురై పని ప్రదేశంలోనే మహిళా కూలీ మృతి చెందిన ఘటన దేవరపల్లి మండలం పల్లంట్లలో మంగళవారం జరిగింది. ఏపీఓ జీవీ శ్రీనివాస్ తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. పల్లంట్లకు చెందిన బొందల చంద్రమ్మ(53) 15 ఏళ్లుగా ఉపాధి పనులు చేస్తూ జీవనం సాగిస్తోంది. మంగళవారం ఉదయం గ్రామంలోని రైతు పొలంలో ఫార్మ్ చెరువు తవ్వకం పనులకు వెళ్లిన చంద్రమ్మ కొద్దిసేపటికి అస్వస్థతకు గురైంది. వెంటనే వైద్యం కోసం గ్రామానికి తీసుకువస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది.

బెట్టింగ్‌ల మోజులో యువత

జీవితాలు బలైపోతాయని హెచ్చరిస్తున్న పోలీసులు

రాజానగరం: అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానంతో పొందుతున్న విజ్ఞానాన్ని సమాజ హితం కోసం కాకుండా తప్పుడు మార్గాలలో సంపాదనలకు కొంతమంది స్వార్థపరులు ఉపయోగిస్తుంటే, వాటికి ఆకర్షితులై కొంతమంది యువత తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. ముఖ్యంగా తమ బిడ్డలు ఉన్నతంగా ఉండాలి, ఉన్నత స్థాయి ఉద్యోగాలు చేయాలనే ఆశతో చాలామంది తల్లిదండ్రులు తమ కడుపులు మాడ్చుకుని, అప్పులు చేసి మరీ పిల్లలను చదివిస్తున్నారు. ఈ క్రమంలో దూర ప్రాంతాలలోని కళాశాలలలో చదువుకునేందుకు వచ్చే విద్యార్థులు హాస్టల్స్‌లో ఉంటూ చదువులు సాగిస్తుంటారు. అయితే ఇటువంటి వారిలో కొంతమంది చెడు స్నేహాలతో కన్నవారి ఆశలను వమ్ము చేయడమే కాకుండా, తమ బంగారు జీవితాలను కూడా నాశనం చేసుకుంటున్నారు.

బ్రిడ్జి కౌంటీ కేంద్రంగా ...

విద్యా, వ్యాపార రంగాలకు ప్రధాన కేంద్రంగా అభివృద్ధి చెందుతున్న రాజమహేంద్రవరం సమీపంలో ఇంజినీరింగ్, వైద్య కళాశాలలు అనేక ఉండటంతో యాప్‌ల ద్వారా బెట్టింగ్‌లు నిర్వహించే వ్యక్తులు ఈ ప్రాంతాన్నే తమ కేంద్రంగా చేసుకుని, బెట్టింగ్ కార్యకలాపాలను నిర్వహిస్తున్నారు. ఆదివారం రాత్రి జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న బ్రిడ్జి కౌంటీలో 12 మంది నిందితులు పట్టుబడ్డారు. చేపల చెరువుల ద్వారా ఆర్థికంగా నష్టపోయిన భీమవరానికి చెందిన దండు వెంకట వర్మ అనే సంతోష్ (31), కర్నాటక రాష్ట్రంలోని రాయచూర్‌కు చెందిన ఇమ్మంది భరత్‌కుమార్ (34)తో కలిసి బ్రిడ్జి కౌంటీలోని బి-12 విల్లాను అద్దెకు తీసుకుని, కొన్ని నెలలుగా క్రికెట్ బెట్టింగ్‌లు నిర్వహిస్తున్నాడు. వీరిద్దరినీ అడ్మిన్లుగా చేసుకుని, భీమవరం నుంచి దుబాయ్ వెళ్లిన వినీత్ అనే మరో వ్యక్తి కీ రోల్ పోషిస్తున్నాడని తెలుసుకున్న పోలీసులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. బ్రిడ్జి కౌంటీలో ఇటువంటి కార్యకలాపాలు ఎక్కడెక్కడ జరుగుతున్నాయనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. ఇటువంటి వాటి గురించి సమాచారం తెలిస్తే వెంటనే తమకు తెలియజేసి, సహకరించాలని నార్త్ జోన్ డీఎస్పీ వై. శ్రీకాంత్ విజ్ఞప్తి చేశారు. తప్పుడు మార్గాలలో పయనించి, జీవితాలను నాశనం చేసుకోవద్దని యువతకు ఆయన హితవు పలికారు. హాస్టల్స్‌లో ఉంచి చదివిస్తున్న తమ పిల్లల ప్రవర్తనలపై తల్లిదండ్రులు కూడా నిరంతర నిఘా ఉంచాలని సూచించారు.



క్రికెట్ బెట్టింగ్‌లే అధికం

సమాచారం కోసం కనుగొన్న సెల్‌ఫోన్ నేడు అందరికీ జీవితంలో ఒక భాగమైపోయింది. చిన్నపిల్లల నుంచి పండు ముదుసలి వరకు సెల్‌ఫోన్ ముట్టుకోకుండా రోజుగడవడం లేదనడం అతిశయోక్తి కాదు. ఈ క్రమంలో ఇక విద్యార్థుల గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. దీంతో పేకాట, గుండాటల తరహాలోనే ఆన్‌లైన్‌లో అనేక రకాల యాప్‌లు హల్‌చల్ చేస్తున్నాయి. అనేక మంది వాటికి ఆకర్షితులవుతున్నారు. తెలిసీ తెలియని పరిజ్ఞానంతో వారి బ్యాంకు అకౌంట్ల వివరాలు అపరిచితులకు తెలియజేయడమే కాకుండా తల్లిదండ్రుల అకౌంట్లను కూడా కొల్లగొట్టేందుకు తోడ్పడుతున్నారు. ఈ క్రమంలోనే కొంతమంది అమాయకులు భయంతో బయటకు చెప్పుకోలేక, తల్లిదండ్రులకు తెలిస్తే ఏమవుతుందోననే భయంతో జీవితాలను అర్థంతరంగా ముగించుకునే పరిస్థితులు కూడా తలెత్తుతున్నాయి. ఇటువంటి వాటిలో క్రికెట్ బెట్టింగ్‌లే ఎక్కువగా ఉన్నాయి. బార్బర్ షాపులలో కూడా టీవీలను పెట్టుకుని, యాప్‌ల ద్వారా బెట్టింగులు నిర్వహిస్తున్నారు. వీటిని నిరోధించేందుకు పోలీసులు ఎంతగా ప్రయత్నించినా, సరైన ఫలితాలు కనిపించడం లేదు.

ద్రాక్షారామలో పేలుడు కలకలం

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం మండలంలోని ద్రాక్షారామలో పేలుడు కలకలం చోటు చేసుకుంది. ద్రాక్షారామ ఎస్సై ఎం. లక్ష్మణ్ తెలిపిన వివరాల ప్రకారం బాధిత కుటుంబం ఎండీ జాఫర్ హుస్సేన్ అతని భార్య ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడుతో కలసి ద్రాక్షారామ నున్నవారి వీధిలో నివాసం ఉంటున్నారు. జాఫర్ మార్కెట్‌లో మటన్ దుకాణం నడుపుకుంటున్నాడు. సోమవారం రాత్రి భోజనం చేసి భార్య, కుమార్తెలు పెంకుటింటిలో నిద్రపోగా, జాఫర్, అతడి కుమారుడు ఇంటి పెరటిలో ఉన్న రేకుల షెడ్డులో నిద్రపోయారు. అర్ధరాత్రి 1.15 గంటలకు పేలుడు శబ్దం, మంటలు రావడంతో భయపడి లేచి బయటకు వచ్చి చూసేసరికి అదే గ్రామానికి చెందిన మహమ్మద్ రోషన్ అబ్బాస్, మరో ఇద్దరు గుర్తు తెలియని యువకులు వీరిని చూసి మోటారు సైకిళ్లపై పారిపోయారు. గాజు సీసాలకు చుట్టిన ఔట్లు, పేలుడు పదార్థాలతో ఇంటిపై దాడి చేశారని, గతంలో రోషన్ అబ్బాస్ బావ మహ్మద్ అలీహుస్సేన్‌కి తనకి మసీదు విషయంలో ఉన్న గొడవలను దృష్టిలో పెట్టుకుని తమ కుటుంబాన్ని చంపాలని, ఇంటిని నాశనం చేసి ఆస్తి నష్టం కలిగించాలనే ఉద్దేశంతో తమపై దాడికి పాల్పడ్డారని జాఫర్ హుస్సేన్ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై లక్ష్మణ్ తెలిపారు. ఘటనా స్థలాన్ని సీఐ వెంకట నారాయణ సిబ్బందితో కలసి పరిశీలించారు.


ఘటనా స్థలం వద్ద గాజు సీసా, పేలుడు పదార్థాల అవశేషాలు


ఘటనా స్థలం వద్ద పరిశీలిస్తున్న పోలీస్ అధికారులు

సీసీఎల్ క్రికెట్ టోర్నీ విజేత డీడీ ఎలెవెన్

అమలాపురం టౌన్: జిల్లా కేంద్రం అమలాపురంలోని శ్రీ చెన్నమల్లేశ్వర కళా పరిషత్ గ్రౌండ్స్‌లో ఐదు రోజులుగా ఫ్లడ్ లైట్ల వెలుగుల్లో జరుగుతున్న సీసీఎల్ సీజన్ -2 నైట్ జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు సోమవారం అర్ధరాత్రితో ముగిశాయి. ఈ క్రికెట్ టోర్నీ ఫైనల్‌లో అమలాపురం డీడీ ఎలెవెన్, ఎంఎం జట్ల మధ్య హోరాహోరీ పోరు జరిగింది. ఫైనల్ పోటీల్లో చివరకు అమలాపురం డీడీ ఎలెవెన్ జట్టు విజేతగా నిలిచి విన్నర్స్ స్థానాన్ని కైవసం చేసుకుంది. రన్నర్ స్థానాన్ని అమలాపురం ఎంఎం జట్టు సాధించింది. ఈ పోటీలకు జిల్లావ్యాప్తంగా 38 జట్లు హాజరయ్యాయి. విన్నర్ జట్టుకు రూ.30 వేలు, రన్నర్ జట్టుకు రూ.20 వేలు, బహుమతులు, ట్రోఫీలను నల్లా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ నల్లా పవన్‌కుమార్, మాజీ కౌన్సిలర్ దున్నాల దుర్గ, స్థానిక నాయకులు ఉద్దీశ చిన్న, గునిశెట్టి బాబు, పిండి రాజా, పోలిశెట్టి కిరణ్‌లు అందజేశారు. పోటీల నిర్వాహకులు పేరాబత్తుల ఫణి, ఉద్దీశ కిషోర్, నల్లా సాయి, నల్లా చిట్టిబాబు, ముచ్చర్ల రమేష్, ఉద్దీశ చిన్న, నల్లా మల్లిబాబు మ్యాచ్‌లను పర్యవేక్షించారు.


విన్నర్స్ డీడీ ఎలెవన్ జట్టుకు షీల్డ్, నగదు బహుమతిని అందజేస్తున్న టోర్నీ నిర్వాహక ప్రతినిధులు

బ్లడ్ బ్యాంక్‌లో తనిఖీలు

కాకినాడ క్రైం: కాకినాడలోని శ్రీ యువసేన బ్లడ్ బ్యాంక్‌లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు మంగళవారం తనిఖీలు చేపట్టారు. డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహనాయక్ ఆధ్వర్యంలో ఈ తనిఖీలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సాధారణ తనిఖీలలో భాగంగా బ్లడ్ బ్యాంక్‌ను పరిశీలించినట్లు తెలిపారు. రిజిస్టర్లు పరిశీలించామని, రిక్విజేషన్ ఫాంలోని వివరాల ఆధారంగా దాతలు, గ్రహీతలతో మాట్లాడి నిర్ధారించుకున్నట్లు తెలిపారు. బ్లడ్ స్టాక్ రికార్డు, డోనార్ రికార్డు, క్యాంప్ రిజిస్టర్స్, క్రాస్ మ్యాచింగ్, డిస్కార్డ్ రిజిస్టర్, బ్లడ్ ఇష్యూ రిజిస్టర్, పేమెంట్ రిక్విజేషన్ ఫాం, పేమెంట్ రిసీప్ట్స్, ఫిజికల్ స్టాక్, బ్లడ్ కలెక్షన్, మ్యాచింగ్, కాంపోనెంట్ ప్రిపరేషన్, వైరల్ స్క్రీనింగ్ రూంలను తనిఖీ చేసినట్లు తెలిపారు. శ్రీ యువసేన బ్లడ్ బ్యాంక్‌లో నిబంధనలకు అనుగుణంగానే రక్తదాన సేవలు కొనసాగుతున్నాయని నిర్ధారించినట్లు తెలిపారు. ఈ తనిఖీలలో జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ వ్యాధుల నియంత్రణాధికారి(డీఎల్‌వో) డాక్టర్ రోణంకి రమేష్ పాల్గొన్నారు.


రిక్విజేషన్ పత్రాలు తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహనాయక్, డీఎల్‌వో డాక్టర్‌రమేష్

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 – 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 – 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	18,000
గటగట (వెయ్యి)	16,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	17,000
గటగట (వెయ్యి)	15,000
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	13,500 – 14,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	14,500 – 15,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

ఇద్దరికి నిర్ధారణ.. ఒకరికి అనుమానం

జీజీహెచ్‌లో జీబీఎస్ కేసులు

కాకినాడ క్రైం: కాకినాడ జీజీహెచ్‌లో జీబీఎస్ బాధిత కేసులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. వారిలో ఇద్దరికి నిర్ధారణ కాగా, మరో వ్యక్తికి జీబీఎస్‌గా అనుమానం వ్యక్తం చేశారు. పరీక్షల ఫలితాలు రావలసి ఉందని తెలిపారు. బాధితుల్లో ఒకరి పరిస్థితి ఆందోళనకరంగా ఉన్న నేపథ్యంలో ఇంట్రావీనస్ ఇమ్యూనో గ్లోబులిన్(ఐవీఐజీ) ఇస్తున్నట్లు తెలిపారు.

బాలుడి అదృశ్యాన్ని ఛేదించిన పోలీసులు

గోకవరం: బాలుడి అదృశ్యాన్ని పోలీసులు గంటల వ్యవధిలో ఛేదించారు. గోకవరం గ్రామానికి చెందిన రామోజు దుర్గావీరవెంకటసంతోష్ తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. తల్లిదండ్రులు మందలించడంతో సోమవారం ఉదయం 10.30 గంటల సమయంలో ఇంట్లోంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్సై వీఎస్‌వీ పవన్‌కుమార్ సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి మంగళవారం తెల్లవారుజాము 3 గంటల ప్రాంతంలో నెల్లూరు జిల్లా మనుబోలులో బాలుడి ఆచూకీని గుర్తించారు. వెంటనే సిబ్బంది అక్కడికి వెళ్లి బాలుడిని సురక్షితంగా తీసుకువచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.

ప్రైవేట్ స్కూల్ బస్సు బోల్తా

13 మంది విద్యార్థులకు గాయాలు


బోల్తా పడిన ప్రైవేటు బస్సు

జగ్గంపేట: జగ్గంపేట మండలం కాండ్రేగుల గ్రామంలో మంగళవారం ఉదయం విద్యార్థులతో జగ్గంపేట వస్తున్న ఒక ప్రైవేటు స్కూల్ బస్సు బోల్తా పడింది. ప్రమాద సమయంలో బస్సులో 13 మంది విద్యార్థులు ఉండగా వీరిలో 9 మందికి స్వల్పంగాను, మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. జగ్గంపేట ఎస్సై రఘునాథరావు తెలిపిన వివరాల మేర కు ఉదయం జగ్గంపేట వస్తున్న బస్సు కాండ్రేగుల గ్రామ శివారులో బోల్తాపడింది. స్థానికుల సహకారంతో విద్యార్థులను బయటకు తీసి జగ్గంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. వీరిలో 9 మందిని ప్రాథమిక చికిత్స అనంతరం ఇళ్లకు పంపించేశారు. తీవ్రంగా గాయపడిన మరో నలుగురు తోటకూర కార్తీక్ నాగేంద్ర, అనితా రామచక్ర, ద్వారపూడి ధనలక్ష్మి, బొదిరెడ్డి శ్రావణిలను మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం ప్రైవేటు ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. స్కూల్ కరస్పాండెట్, వైఎస్సార్ సీపీ జిల్లా బూత్ కమిటీల అధ్యక్షుడు ఒమ్మి రఘురాంఆస్పత్రికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. విద్యార్థులందరూ 6 నుంచి 9 తరగతి చెందిన వారని, డ్రైవర్ అజాగ్రత్త వల్లే ఈ ప్రమాదం జరిగిందని ఎస్సై తెలిపా రు. ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రణీత్ విద్యార్థులకు వైద్య సేవలందించారు.

150 కేజీల గంజాయి పట్టివేత

- రూ.7లక్షల 50 వేలు విలువైన సరకు స్వాధీనం
- ఐదుగురి అరెస్టు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): లక్షల రూపాయల గంజాయిని తరలిస్తున్న ముఠా గుట్టురట్టు చేశారు తూర్పుగోదావరి జిల్లా పోలీసులు. వారి నుంచి పెద్ద మొత్తంలో గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీనిని రవాణా చేస్తున్న ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేసి జైలుకు పంపారు. దీనికి సంబంధించి జిల్లా ఎస్పీ డి.నరసింహకిశోర్ మంగళవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఆ వివరాలను వెల్లడించారు.

పట్టుబడిందిలా...

ఉదయం 11 గంటల సమయం. ఏజెన్సీ నుంచి రాజమహేంద్రవరం మీదుగా గంజాయి రవాణా అవుతుందని పక్కా సమాచారం ఉండడంతో రూరల్ ప్రాంతంలోని కొంతమూరు గామన్ ఇండియా బ్రిడ్జి వద్ద పోలీసులు ముమ్మరంగా వాహనాలు తనిఖీలు చేస్తున్నారు. అయితే నిందితులు ముందస్తుగా గంజాయి తరలించే వాహనానికి ఒక ఆటోను పైలట్‌గా ఏర్పాటు చేసుకున్నారు. ఆ ఆటోలో వారు గంజాయి తీసుకెళ్తున్న మార్గంలో పోలీసులు తనిఖీలు చేస్తుంటే ఆ సమాచారాన్ని వారికి సమాచారం ఇస్తారు. అలా రంపచోడవరం నుంచి ఎయిర్‌పోర్టు రోడ్డులో వస్తూ వంతెన కింద నుంచి నేషనల్ హైవే 16 పైకి ఎక్కుతుండగా పైలట్ ఆటోలో వారు పోలీసులను గమనించి ఆ సమాచారం గంజాయి రవాణా అవుతున్న వాహనంలో ఉన్న వారికి సమాచారం ఇచ్చారు. విషయం తెలిసిన గంజాయి రవాణాదారులు పారిపోతుండగా రాజానగరం పోలీస్‌స్టేషన్ ఎస్సై మనోహర్, పోలీసు సిబ్బంది ఆ కారును, ఆటోను వెంబడించి పట్టుకున్నారు. మొత్తం రెండు కేజీల చొప్పున 75 ప్యాకెట్లలో కారు డిక్కీలో గంజాయి దొరికింది. పట్టుకున్న గంజాయి విలువ రూ.7 లక్షల 50 వేలు ఉంటుందని పోలీసుల తెలిపారు. దీనిని రవాణా చేస్తున్న ప్రకాశం జిల్లా కంభం గ్రామానికి చెందిన షేక్ ఇంతియాజ్, సింగరాయికొండకు చెందిన షేక్ అబ్దుల్, ఏఎస్ఆర్ జిల్లా రంపచోడవరం మండలం సీతంశెట్టినగర్‌కు చెందిన సంకురు బుచ్చిరెడ్డి, రెడ్డీపేట సంతమార్కెట్‌కు చెందిన ముర్ల చిన్నారెడ్డి, బూసి గ్రామానికి చెందిన ఉలుగుల రవికిరణ్‌రెడ్డిలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 5 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. గంజాయి ఎవరు సరఫరా చేస్తున్నారు, ఎవరికి అమ్ముతున్నారు అనే విషయాలను దర్యాప్తు చేస్తామని ఎస్పీ డి.నరసింహాకిశోర్ తెలిపారు. నార్త్ జోన్ డీఎస్పీ వై.శ్రీకాంత్ పర్యవేక్షణలో గంజాయి పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన రాజానగరం సీఐ వీరయ్యగౌడ్, ఎస్సై పి.మనోహర్, కానిస్టేబుల్స్ రమణ, నాగేశ్వరరావు, కరీముల్లాఖాదర్‌లను ఎస్పీ అభినందించారు.


స్వాధీనం చేసుకున్న గంజాయిని మీడియాకు చూపుతున్న ఎస్పీ నరసింహకిశోర్

నిమ్మకు తెగుళ్ల బెడద

పాడి-పంట


ముత్యాలవారిపాలెంలో తెగుళ్లు ఆశించిన నిమ్మతోట (అంతరచిత్రం) సీహెచ్ శ్రీనివాస్ ఉద్యానవన అధికారి కొవ్వూరు (ఏడీఏ)

పెరవలి: జిల్లాలో నిమ్మపంట 720 హెక్టార్లలో సాగు జరుగుతుండగా వివిధ రకాల తెగుళ్లు ఆశించి ఉండటంతో దిగుబడిపై తీవ్ర ప్రభావం పడి, తోటలు పాడైపోతున్నాయి. ముఖ్యంగా ఈ పంటపై ఆకు ముడత, పండ్ల రసాన్ని పీల్చే రెక్కల పురుగులు, బంక, వేరుకుళ్లు, గజ్జి, మొజాయిక్ తెగుళ్లు ఆశించి ఉన్నాయి. ఈ తెగుళ్ల నివారణకు రైతులు తీసుకోవలసిన జాగ్రత్తలు, సస్యరక్షణ చర్యలు గురించి కొవ్వూరు ఉద్యాన అధికారి (ఏడీఏ) సీహెచ్ శ్రీనివాస్ వివరించారు.

ఆకుముడత : ఈ తెగులు ఎక్కువగా లేత చిగుర్లపై ఆశించి ఆకులపై తెల్లటి పొరలు వంకర టింకరగా ఏర్పడి ఆకులు ముడుచుకునేలా చేస్తుంది. తద్వారా ఆకులపై గజ్జి తెగులు ఎక్కువగా వ్యాప్తి చెంది ఆకులు రాలిపోతాయి.

నివారణ చర్యలు : ఆకులు ముడతలు పడినట్లు గుర్తించిన వెంటనే నివారణ చర్యలు చేపట్టాలి. డైమిథోయేట్ 2 మిల్లీ లీటర్లు లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.5మిల్లీ లీటర్లు మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. దీని ఉధృతి ఎక్కువగా ఉంటే 10 రోజుల వ్యవధిలో రెండవసారి పిచికారీ చేయాలి.

తెల్లపొలుసు పురుగులు : ఈ పొలుసు పురుగులు ఎక్కువగా కాండంపై ఆశించి సున్నం పూసినట్లుగా కనపడతాయి. ఇవి కాండం, కొమ్మలలో రసాన్ని పీల్చివేయటం వల్ల అవి ఎండిపోతాయి.

నివారణ చర్యలు : ఈ పురుగులు ఆశించిన చోట గోనె సంచితో బాగా రుద్ది మిథైల్‌డెమటాన్ లేదా డైమిథోయేట్ 2 మిల్లీ లీటర్లు మందును లీటరు నీటిలో కలిపి కాండం, కొమ్మలపై పిచికారీ చేయాలి.

నల్లి పురుగులు : నల్లి పురుగుల్లో ఆకుపచ్చ నల్లి, మంగు నల్లి ముఖ్యమైనవి. ఆకునల్లి ఆకులపైన, మంగునల్లి కాయలపైన ఆశించి రసాన్ని పీల్చివేస్తాయి. దీనివల్ల కాయలపై చిన్న చిన్న తెల్లని మచ్చలు లేదా ముదురు గోధుమ రంగు మచ్చలు ఏర్పడి కాయ అంతటా మంగు ఏర్పడుతుంది.

నివారణ చర్యలు : నీటిలో కరిగే గంధకం 3గ్రాములు లేదా డైకోఫాల్ 5.0 మిల్లీ లీటర్లు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేస్తే నివారణ అవుతుంది.

రసం పీల్చే రెక్కల పురుగులు : ఈ రెక్కల పురుగులు పండ్లపై రంధ్రాలు చేసి కాయలో ఉండే రసాన్ని పీల్చుతాయి. దీంతో కాయలకు చేసిన రంధ్రాల ద్వారా శిలీంద్రాలు, బ్యాక్టీరియా చేరి పండ్లు కుళ్లి, రాలిపోతాయి. పండ్లపై దాగు ఏర్పడుతుంది.

నివారణ చర్యలు : ఈ పురుగులు ఆశించి కుళ్లి, రాలిపోయిన కాయలను ఏరి నాశనం చేయాలి. పురుగులను నాశనం చేయటానికి మలాథియాన్ ఒక మిల్లీలీటరు మందుకు ఒక శాతం పంచదార, పండ్ల రసం కలిపి చెట్ల కింద అమర్చాలి. పురుగులను ఆకర్షించటానికి బల్బులను ఏర్పాటు చేయాలి. దీని ద్వారా పురుగులను అరికట్టవచ్చు. పురుగుల నుంచి కాయలను రక్షించటానికి కాయలకు బుట్టలను ఏర్పాటు చేస్తే మంచి ఫలితం ఉంటుంది.

బంక తెగులు : బంక తెగులు రెండు రకాలు ఒకటి ఫైటోఫ్తోరా, రెండు డిప్లోడియా. మొదటి తెగులు ఆశించిన చెట్టు నుంచి ధారాళంగా బంక కారుతుంది. ఇది చెట్టు వేళ్లకు, మొదలు కింది భాగానికి పరిమితమై ఉంటుంది. డిప్లోడియా బంక తెగులు చెట్టు మొదలు పైభాగాన కొమ్మల పంగల్లో ఎక్కువగా ఆశిస్తుంది. ఈ తెగులు ఎక్కువగా ఉంటే బంక కారటం, బెరడు కుళ్లటం జరుగుతుంది. నీరు త్వరగా ఇంకని భూముల్లో దీని ప్రభావం అధికంగా ఉంటుంది.

నివారణ చర్యలు : బంక కారి కుళ్లిన బెరడును పూర్తిగా తొలగించి బోర్డోపేస్టు లేదా కాపర్ ఆక్సిక్లోరైడ్ పేస్టు పూయాలి. ఈ పేస్టును మొదలు చుట్టూ పూయాలి. కొమ్మలపై వచ్చే బంక తెగులు నివారణకు లీటరు నీటికి 1గ్రాము కార్బండజిమ్ కలిపి చెట్టు మొత్తం తడిసేలా పిచికారీ చేయాలి. మెటలాక్సిల్ 2 గ్రాములు లీటరు నీటిలో కలిపి చెట్టు మొదలులో పోయాలి.

వేరుకుళ్లు తెగులు : వేరుకుళ్లు తెగులు ఆశించిన చెట్టుకు పోషక పదార్థాలు అందక చెట్లు ఎండిపోతాయి. ఈ తెగులు ఆశించిన చెట్లు ఎక్కువ పూతపూసి కాయలు ముదిరే లోగా చెట్లు వాడి ఎండిపోతాయి. ఎండిన చెట్ల వేర్లను పరీక్షిస్తే కుళ్లిన వాసన వస్తుంది.

నివారణ చర్యలు : వ్యాధి సోకిన తొలి దశలోనే గమనించి చెట్టుకు ఎక్కువగా నీరు కట్టి మరుసటి రోజు కార్బండజిమ్ 2 గ్రాములు లేదా మాంకోజెబ్ 2.5 గ్రాములు లేదా చెషంట్ 3 గ్రాములు లేదా ఒక శాతం బోర్డో మిశ్రమాన్ని లీటరు నీటిలో కలిపి చెట్టు చుట్టూ నేల తడిసేలా పిచికారీ చేయాలి. చెట్టుకి కావలిసిన పోషక పదార్థాలు సేంద్రియ ఎరువులు, పచ్చి రొట్ట ద్వారా అందించాలి. ఒక కిలో ట్రైకోడెర్మా మందును 90 కిలోల పశువుల ఎరువు 10 కిలోల వేపపిండితో కలిపి 15 రోజులు మాగపెట్టి చెట్టు మొదలు చుట్టూ వేయాలి. ఇలా చేస్తే చెట్టును ఈ తెగులు నుంచి కాపాడవచ్చు.

గజ్జి తెగులు (కాంకర్ మచ్చ) : నిమ్మ పంటపై ఎక్కుగా ఆశించే తెగులు ఈ గజ్జి తెగులు. ఇది కాయలు, ఆకులు, చిన్న, పెద్ద కొమ్మలను ఆశిస్తుంది. తెగులు ప్రభావం అధికంగా ఉంటే చెట్లు ఎండిపోయి చనిపోతాయి.

నివారణ చర్యలు : ఈ తెగులు సోకి ఎండిన కొమ్మలను కత్తిరించి స్ట్రెప్టోసైక్లిన్ ఒక గ్రాము, 30 గ్రాములు బ్లైటాక్స్ మందును 10 లీటర్ల నీటిలో కలిపి వారం రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి. గజ్జి ఎక్కువగా ఉన్న ప్రాంతాన్ని గోకి బెరడును తీసి వేసి బోర్డోపేస్టును పూయాలి.


వేరుకుళ్లు తెగులు సోకి చనిపోయిన నిమ్మమొక్క


బూజు తెగులు సోకిన కాండం


మంగునల్లి ఆశించిన నిమ్మకాయ